# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-1 తేదిః 1.9.2014.

దళిత వాడల నుండి దరిద్ర్యాన్ని, పేదల ఇండ్ల నుండి పేదరికాన్ని పారద్రోలడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. నిరుపేదలు కూడా గౌరవంగా బతికే విధంగా వంద శాతం ప్రభుత్వ ఖర్చుతో ఇండ్లు నిర్మిస్తామని, హైదరాబాద్ నగరంలో పేదల బస్తీల్లో మంచి ఇండ్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

సికింద్రాబాద్ బోయిగూడ లోని ఐడిహెచ్ కాలనీని ముఖ్యమంత్రి సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ ప్రాంతంలో వున్న ఆరు కాలనీలలో ముఖ్యమంత్రి కలియ తిరిగారు. సందులు, గొందుల వెంట, ఇరుకైన రోడ్ల వెంట కేసిఆర్ నడుచుకుంటూ ఇల్లిల్లూ పరిశీలించారు. ఎదురపడిన బస్తీ వాసులను పలుకరించారు. వారి కష్టాలను కళ్లారా చూశారు. వారి గోస విన్నారు. గోడు వినిపించుకున్నారు. అత్యంత దుర్భర పరిస్థితుల్లో వున్న కాలనీ వాతావరణాన్ని, రోడ్లను చూసి ముఖ్యమంత్రి చలించారు. కాలనీలో వున్న బహుళ అంతస్తుల భవనాలన్నీ శిథిలావస్థలో వుండడాన్ని స్వయంగా చూశారు. కూలిపోతున్న ఇండ్ల కిటికీల నుండి ఆశగా చూస్తున్న వారందరికి ముఖ్యమంత్రి భరోసా ఇస్తూ ముందుకు సాగారు. మంచినీరు, విద్యుత్ లాంటి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సనత్‌నగర్, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు నగరంలోని అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి వుందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వారున్నారని, కాని ఇలాంటి కాలనీలను చూస్తే నగరంలోని పేద ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థమవుతుందన్నారు. అన్నమో రామచంద్రా అనుకుంటూ పొట్ట చేతపట్టుకుని ఎక్కడెక్కడి నుండో నగరానికి వచ్చినవారు ఇక్కడ దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నారన్నారు. కూలి పోతున్న భవనాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. వారికి కనీస

సౌకర్యాలు కల్పించలేకపోవడం దారుణమన్నారు. కోటీశ్వరులు ప్రభుత్వ భూములను కబ్జా పెడితే రెగ్యులరైజ్ చేసి వారిని కాపాడుతారని, అదే పేదలు ఎక్కడైనా తలదాచుకుంటే బుల్‌డోజర్లు పెట్టి నిలువ నీడను కూల్చేస్తారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇకపై అలాంటి పరిస్థితి వుండదని, తాను పేదల పక్షాన నిలుస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. ఐడిహెచ్ కాలనీలో అందరికి ఇండ్లు కట్టిస్తామని, ఒక్క రూపాయి కూడా లబ్దిదారుడు వాటా ధనం చెల్లించాల్సిన అవసరం లేదని, వంద శాతం ప్రభుత్వ నిధులతో ఇండ్లు కట్టిస్తామని వెల్లడించారు. ఇప్పుడున్న ఇండ్లు ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం వుందని, కాబట్టి వెంటనే వాటిని ఖాళీ చేయాలని ముఖ్యమంత్రి కోరారు. కేవలం ఐదు నెలల కాలంలో కొత్త ఇండ్లు నిర్మిస్తామని, రేపటి నుండే లే అవుట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, జిహెచ్ఎంసి కమీషనర్, మున్సిపల్ కార్యదర్శి ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రస్తుతం ఈ ఇండ్లల్లో నివాసం వుంటున్న వారందరి వివరాలు ఫోటోలతో సహా తీసుకుంటామని, వారికే కొత్త ఇండ్లు కేటాయిస్తామని, మహిళల పేరుపై పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ చేపిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. నగరంలో పేదల ఇండ్ల నిర్మాణ కార్యక్రమం బోయిగూడతోనే ప్రారంభం అవుతుందని సిఎం చెప్పారు. ఇదొక మోడల్ కాలనీగా వుంటుందని, ప్రతి కుటుంబానికి రెండు బెడ్ రూములు, హాలు, కిచెన్లతో కూడిన ఇల్లు వస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కాలనీకి మంచి రోడ్లు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజి లాంటి మౌలిక వసతులతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ఇదే కాలనీలో కూరగాయల మార్కెట్, మాంసహర మార్కెట్, ఇతర షాపులు కూడా నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని, బోయిగూడ ఐడిహెచ్ కాలనీ అందరికి ఆదర్శం అయ్యేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. కాలనీ వాసులు కూడా అధికారులకు సహకరించాలని, ఐదు నెలల పాటు మరో చోట నివాసం వుండాలని కోరారు.

ముఖ్యమంత్రి వెంట ఎక్సైజు శాఖ మంత్రి టి.పద్మారావు, సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస యాదవ్, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్‌కుమార్, మున్సిపల్ శాఖ కార్యదర్శి మీనా తదితరులు వున్నారు.

---

సిపిఆర్ఓ టూ సిఎం